
## ఈ వారం తెలుగు పుస్తకం

# ఉత్తమ చారిత్రక నవల
# తెన్నేటి సూరి "ఛంఘిజ్ ఖాన్"

ఆర్వియార్




**Title :** Chengiz Khan
**Author:** Thenneti Suri
**Subject:** NOVELS
**Year of Publication:** 2002
**Price:** USD $ 2.89

**ఛంఘిజ్ ఖాన్ ( *యీ వర్ణక్రమం అనేక రకాలుగా వుంది. చింగిజ్ అని ఛింగిజ్ అనీ, జెంగిజ్ అని రకరకాలుగా వుంది. ఇంగ్లీషులో (chi-cha-jen -Gen అంటూ అనేక రూపాల్లో కనిపిస్తుంది* ) అనేది వ్యక్తి పేరు కాదు. బిరుదు. "జగజ్జేత, సర్వసేనాధినేత, సాటిలేని యోధుడు అని అర్థం. ఖాఖాన్ అనీ ఛంఘిజ్ ఖాన్‌ని వ్యవహరిస్తారు. అంటే చక్రవర్తి అని అర్థం. అసలుపేరు టెమూజిన్. 'ఉక్కుమనిషి' అని అర్థం. చరిత్రలో ఛంఘిజ్ ఖాన్ గా ప్రసిద్ధుడైన యీ మహావీరుడు యుద్ధ తంత్రంలో ఆరితేరినవాడు. యితనితో పోలిస్తే అలెగ్జాండర్, సీజర్‌లు సూర్యుడి ముందు దివిటీలని నెహ్రూ రాశారు. జోర్గన్ బిష్క్ అలెగ్జాండర్ ది గ్రేట్, నెపోలియన్లు యితని ముందు పిల్లకాయలని "*మంగోలియా అన్‌నోన్ లాండ్*' లో రాశాడు. అయితే అలెగ్జాండర్‌నీ, సీజర్‌నీ, నెపోలియన్‌నీ మహా సైనిక వీరులుగా ఆకాశానికి యెత్తేసిన పాశ్చాత్య చరిత్రకారులు ఛంఘిజ్‌ఖాన్‌ని మాత్రం పరమ క్రూరుడనీ, రాక్షసుడనీ, నెత్తురు తాగే పిశాచమనీ లెక్క గట్టేరు. యిదీ వాళ్ళ నిష్పాక్షిక చారిత్రక దృష్టి!**

ఛంఘిజ్‌ఖాన్‌గా బిరుదు పొందిన వ్యక్తి పేరు టెమూజిన్. తండ్రి యాసుకై భగతూర్. తల్లి యూలన్ ఆమె మెర్కిట్ తాండాకు చెందిన ఆవిడ. యాసుకై ఆమెని యెత్తుకొచ్చాడు. ఆమె కాన్పు సమయంలో యాసుకై తాతర్‌ల మీదకు దండ యాత్రకు వెళ్ళాడు. ఆ తెగ నాయకుడైన టెమూజిన్‌ని హతమార్చాడు. అతను తిరిగి వచ్చేటప్పటికి యూలన్ ప్రసవం సంగతి తెలిసింది. ఆ మగబిడ్డకు టెమూజిన్ అని పేరు పెట్టేడు. ఓడిపోయిన శత్రువు శౌర్య పరాక్రమాలు కొత్తగా పుట్టిన శిశువుకు వస్తాయన్న నమ్మకం యిందుకు కారణం. టెమూజిన్ యింకా పిల్లవాడుగా వున్నప్పడే యాసుకై విషప్రయోగం జరిగి మరణించాడు. టెమూజిన్‌కి చిన్నతనంలోనే ఒగిరెట్ తెగ బాలిక బుర్టీ తో ప్రధానం జరిగింది. ఆనాటి ఆచారం ప్రకారం ప్రధానం అయిన అత్తవారింట్లో టెమూజిన్ వున్నాడు. అప్పడు యాసుకై మరణ వార్త చేరింది. మంగోలు తెగ నాయకత్వం లేని అనాథ అయింది. టెమూజిన్ తల్లిని తెగ వదిలి వేసింది. టెమూజిన్ శత్రువుల చేతిలో బందీ అయేడు. తప్పించుకుని పారిపోయాడు. మళ్ళీ సైనిక శక్తిని కూడగట్టుకుని మంగోల్ తెగని ఏకం చేసి ఒక తాటి మీదకు తెచ్చాడు. ఎన్నో దండయాత్రలు చేశాడు. ఖొరెజ్మ్ (*తెన్నేటిసూరి క్వారిజం అని వ్యవహరించారు*) షా ని ఓడించేడు. అనేక ప్రాంతాల్ని జయించి మహాసామ్రాజ్యం నిర్మించేడు. ఆ తెగ 'కురుల్‌తాయ్' సమావేశం జరిగింది. టెమూజిన్‌ని

'ఛంఘిజ్‌ఖాన్ గా యెన్నుకుంది. తెన్నేటి సూరి నవల "ఛంఘిజ్‌ఖాన్'కి యీ చరిత్రక ఇతివృత్తం నేపథ్యంగా వుంది. యిది ఆ రకంగా చారిత్రక నవల. పాశ్చాత్య చరిత్రకారుల హ్రస్వ దృష్టి వల్ల ఛంగిజ్‌ఖాన్ కి జరిగిన అన్యాయాన్ని తూర్పారబట్టి, వ్యక్తిగా, నాయకుడుగా, సైనిక యోధునిగా ఛంఘిజ్‌ఖాన్ వ్యక్తిత్వం యెలాంటిదో కళ్ళకు కట్టినట్టు చిత్రించడమే యీ నవల లక్ష్యం. చరిత్ర యథార్థ ఘటనల సమాహారం కాబట్టి స్వకపోల కల్పితాలకి ఆస్కారం వుండదు. ఆ సంఘటనల నేపథ్యంలో ఆయా వ్యక్తులు యెలా పరిణతి పొందుతారో, వాళ్ళ మనఃస్థితి యెలాంటిదో, వ్యక్తిత్వాలు యెలాంటివో, వాళ్ళ స్వభావాలు యెలాంటివో, వాళ్ళ మానసిక సంఘర్షణలు యెలాంటివో ప్రదర్శించడమే నవలాకారుడి కర్తవ్యం.

చారిత్రక నవలలోని "పాత్రలకూ సన్నివేశాలకూ, అటు దేశ కాల పరిస్థితులకూ కార్యకారణ సంబంధం వుంటుంది". రా.రా. చెప్పినట్టు, ఆనాటి చారిత్రక పరిస్థితులకూ వాతావరణానికీ ప్రాముఖ్యం వుంటుంది. చారిత్రకంగా వుండడం తప్పనిసరి. అదే సమయంలో నవలగా సాహిత్య విలువలు యే మాత్రం నష్టపోకుండా ఆ ప్రక్రియ సాగాలి.

తెన్నేటి సూరి "ఛంఘిజ్‌ఖాన్" ఉత్తమ చారిత్రక నవల. చరిత్ర చరిత్రగా వుంటూనే నవలగా ఆ పాత్రల స్వభావాలు, మనఃస్థితులు, సంఘర్షణలు కళాత్మంగా చిత్రిస్తుంది.

నవల యాసుకై యూలన్‌ని యెత్తుకు రావడంతో మొదలవుతుంది. యూలన్‌కి అంతకు ముందే అర్గున్‌తో పెళ్ళి నిశ్చయం అయింది. ఆమె ఆ జ్ఞాపకాల నుంచి బయట పడలేదు. ఆమె తోడబుట్టిన వాడు కరాచర్. ఆమెను బుజ్జగించి యాసుకైకి ఒదిగి పోయేలా చేస్తాడు. దాంతో అతని మీద యాసుకైకి కూడా గౌరవం పెరుగుతుంది. మంగోలియన్ల మతవిశ్వాసం షామానిజం. పాహోన్లు అనే మతపెద్దలు అతీత శక్తుల్ని అధీనంలో వుంచుకుని దైవవాక్కు వినిపిస్తూ వుంటారట. షామాన్ దేవుని ప్రతినిధి. దైవవాణి. షామాన్ గుయాగ్జూ మంగోలుల మూఢ నమ్మకాలని వాటంగా వాడుకుని తన పలుకుబడి పదిలంగా చూసుకుంటున్నాడు. యూలన్ అంటే యాసుకై వెర్రెత్తి పోవడం చూసి కంగారు పడతాడు. తన ప్రభావానికి గండి పడుతుందని బెంగ పట్టుకుంటుంది. యేదో రకంగా కరాచర్‌ని వదిలించుకోవాలని యెత్తు వేస్తాడు. కరాచర్ యుక్తి వల్ల ఆ పథకం బెడిసికొడుతుంది. యూలన్ మగబిడ్డను కంటుంది. యాసుకై ఆ బిడ్డకు 'టెమూజిన్' అని పేరు పెడతాడు. టెమూజిన్ మహావీరుడై జగత్తునంతట్నీ జయిస్తాడనీ అది దేవుని వాక్కు అనీ షామాన్ డప్పుకొడతాడు. టెమూజిన్‌కి కేరట్ నాయకుడు తుఘ్రుల్ ఖాన్ తమ్ముడు అన్న మీద తిరుగుబాటు చేస్తాడు. తుఘ్రుల్‌ఖాన్ ( యితన్ని మార్కోపోలో ప్రెస్టర్ జాన్ అని వ్యవహరించేడు) యాసుకై సాయం కోరి వస్తాడు. యాసుకై, తుఘ్రుల్‌ఖాన్ అగ్నిసాక్షిగా 'అండా' ప్రమాణం చేస్తారు.

యాసుకై టెమూజిన్ కి మెర్కిట్ తండా పిల్లని పెళ్ళి చెయ్యాలని సంకల్పిస్తాడు. ఆ ప్రయత్నంలో వెడుతూ వుంటే కరమ్‌రాట్ నాయకుడు డెయినెజెన్ తన కూతురు బుర్టేని యిస్తానని అంటాడు. టెమూజిన్‌ని తనతో తీసుకు వెడతాడు. యాసుకై తిరిగి వస్తూ టైజూట్ నాయకుడు టర్గుటాయ్ ఆతిథ్యం స్వీకరిస్తాడు. టర్గుటాయ్, యాసుకై వంశాల వాళ్ళు పిన తండ్రి పెత్తండ్రి బిడ్డలు. ఆధిపత్యం కోసం ఒకళ్ళకీ ఒకళ్ళకీ పోరాటాలు జరుగుతూ వుండేవి. అయినా టర్గుటాయ్ ప్రేమ, ఆప్యాయత చూసి యాసుకై సంతోషపడతాడు. ఆ ఆతిథ్యమే అతని ప్రాణం తీసింది. విషప్రయోగం జరిగింది.

టెమూజిన్ అనుచరులతో వెనక్కి బయల్దేరతాడు. మధ్యలో ఒక ఎలుగొడ్డును చూసి దాన్ని తరుముతూ పోతాడు. అతనితో వున్నవాళ్ళు యెంత వెతికినా ఆచూకీ దొరకలేదు. వాళ్ళు తిరిగి వెనక్కి వెళ్ళి పోతారు. టర్గుటాయ్ టెమూజిన్‌ని బందీని చేస్తాడు.

యాసుకై చనిపోయేడు. టెమూజిన్ జాడ తెలియ లేదు. అది అవకాశంగా తీసుకుని షామాన్ రంగు మార్చేస్తాడు. షెగ్నీ బీగీని నాయకుణ్ణి చేయాలని పన్నాగం పన్నుతాడు. అంతకు ముందు దాకా ‘ మహావీరుడు, జగజ్జేతా’ అని బాకా వూదిన షామాన్ ఇప్పుడు మాట మార్చడం కరాచర్‌కి కంటకంగా వుంది. షామాన్ దేవుని వాక్కు మారిందని నీళ్ళు నములుతూ వున్నప్పడే టెమూజిన్ షెగ్నీని హతమార్చి ప్రత్యక్షమవుతాడు.

టెమూజిన్ నాయకత్వం అందుకుంటాడు. తను యెలా తప్పించుకు వచ్చిందీ కరాచర్‌కి టెమూజిన్ చెప్పేడు. తరువాత టెమూజిన్ తన సైనిక వ్యూహం వివరించి అందరి ఆమోదం పొందుతాడు.

చైనా చక్రవర్తి, తుఘ్రుల్‌ఖాన్ కలిశారు. టెమూజిన్ తుఘ్రుల్‌ఖాన్‌ని కలుసుకోవడానికి వెళ్ళేటప్పటికి చైనాకిన్ సామ్రాజ్య ప్రధానమంత్రి సింగ్‌పాల్ రాజధానిలో వున్నాడు. టెమూజిన్  తన యెత్తుగడలో తనువున్నాడు. టెమూజిన్ తంత్రం తుఘ్రుల్‌ఖాన్‌కి దిమ్మెక్కించింది. చైనా ప్రధాని, తుఘ్రుల్‌ఖాన్ యెవళ్ళ జాగ్రత్తల గురించి వాళ్ళు ఆలోచించుకుంటూ వుండిపోయేరు. టెమూజిన్ బుర్జాన్ పర్వతం మీద ఒక యేడాది గడిపేడు. తరవాత తిరిగి వచ్చి తుపాకీ తయారీ కార్యక్రమం యెలా సాగుతున్నదీ పరిశీలించేడు.

టెమూజిన్ ఒక్క మంగోలు తండాకు నాయకుడిగా వుండే పరిస్థితి నుంచి గోబీ తాతర్ జాతులన్నిటికీ ఏకైక నాయకుడయే స్థానానికి ఎదిగాడు. టైజూట్ మెర్కిట్, నైమాన్ ఖాఖానులందర్నీ జయించేడు.

“మధ్య ఆసియాలో ఆనాటికి ఉత్తరాన ఇర్‌టిష్ నదీ తీరాన్ని ఆను చేసుకుని దక్షిణాన  కరకోరం పర్వత శ్రేణి వరకూ, తూర్పున ఓనాన్ తీరం నుంచి పడమరకు ఆల్‌టాయ్ పర్వతశ్రేణి వరకూ  వున్న విశాల ప్రాంతం అంతా టెమూజిన్  ఆధిపత్యం కిందికి వచ్చింది. టెమూజిన్ నైమాన్ తండాలనన్నింటినీ స్వతంత్ర ప్రతిపత్తిలో అలానే వుంచేశాడు. వాటికి స్వతంత్ర ప్రభువుగా చమూగాను నియమించాడు.

చమూగా, టెమూజిన్‌లకు అనేక విషయాలలో అభిప్రాయ భేదాలు వుండేవి. చమూగా పాలనాపరమైన తన అభిప్రాయాలను కార్యరూపంలో పెట్టడానికి నడుం కట్టాడు. పంటల పండగ జరిగే స్థాయిలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. “ ఈ సంవత్సరంలోనూ తను యే సెలయేటికి ఆనకట్టలు పోయించిందీ యే యే చెరువులు యెలా మరమ్మత్తులు చేయించిందీ,యేయే పంట కాలువలు యెక్కడెక్కడ త్రవ్వించిందీ యే యే ప్రాంతంలో యేయే పంటలు యెంతెంత పండిందీ యీ భోగట్టా అంతా” యెంత ఉత్సాహంగా చెప్పాడు. ఆ వేడుకకు టెమూజిన్ వెళ్ళలేదు. కరాచర్ వెళ్ళాడు. చమూగా స్థిర ఆవాసాల పట్లా, ఆయుధాలు అవసరం లేని శాంతి పట్ల మక్కువ వున్నవాడు. నాగరికత ఆ మార్గంలో ముందుకు సాగుతుందని విశ్వసించినవాడు. టెమూజిన్ తండా మనస్తత్వం వాడు.  స్థిరనివాసం  కిట్టదు. ఆయుధాలు విసర్జించడం కిట్టదు.  ఆ మాటే కరాచర్ వెల్లడించిన అభిప్రాయంలో బయట పడుతుంది. చమూగా తను అఖండ విజయం సాధించేనని గొప్పగా అనుకుంటూ వుంటే కరాచర్ ఆ ఉరవడికి ఆనకట్ట కట్టేడు.

"చుట్టూ వున్న సామ్రాజ్యవాదులంతా గోబీ జాతులన్నిట్నీ కాలి క్రింద వేసి చితక ద్రొక్కివెయ్యాలని చూస్తున్న తరుణంలో ఈ ప్రజలనందర్నీ నిరాయుధుల్ని చేసి తమ్ము తాము కాపాడుకోలేని స్థితికి తెచ్చావు. ఈ ప్రజల రక్షణ మాటేమిటి?" అని కరాచర్ ఆనాటి పరిస్థితుల్లో మెడకు చుట్టు కోబోయే ఉచ్చు యేమిటో వివరిస్తాడు. కరాచర్ హెచ్చరిక నిజం అయింది. నైమాన్ తండాలలో వున్న పంచమాంగదళాలు కరాచర్‌ని వెనక్కి తిరిగి వెడుతూ వుంటే హత్య చేశారు. ఖనరెజ్మ్ షా చేసిన విద్రోహానికి టెమూజిన్ రాయబారులు బలి అయేరు. "చముగా ఖఖాన్ కూడా యిపుడు చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో వున్నారు. నైమాన్ ఖానులు తిరుగుబాటు చేసి ఆయన్ను యే క్షణాన్నైనా హత్య చేసి అధికారాన్ని చేజిక్కించుకోవచ్చు" అన్న గూఢచారుల నివేదికా టెమూజాన్‌కి చేరింది" ఇతరులమీద యుద్ధం చేసే అభిప్రాయం లేకపోయినా ఆత్మరక్షణ చేసుకనే తాహతు లేకపోతే శాంతి లభించే అవకాశం లేదు. అని చెప్పారు సేనానులు. చముగా ఆయుధ విసర్జన కార్యక్రమం ఆత్మరక్షణార్థం ఆయుధాలు అందుకునే స్థితికి తేలింది. ఆఖరికి చమూగా ఆత్మహత్య చేసుకుంటాడు. అతని యత్నం, శాంతికామన ఈ దుస్థితి తెచ్చిపెట్టేయి. మహమ్మద్ షా చేసిన దురాగతానికి ప్రతిగా టెమూజిన్ దండయాత్ర చేశాడు. అలాగే తుఘ్రుల్‌ఖాన్ కుతంత్రాలని టెమూజిన్ యెండ గట్టేడు. (యిక్కడే టెమూజిన్ రాసిన లేఖ ప్రస్తావన వస్తుంది.) తుఘ్రుల్‌ఖాన్ మీద యుద్ధం చెయ్యవలసివస్తుంది. అతని తల ఖండిస్తాడు టెమూజిన్.

ఆ దరిమిలా క్రీ.శ.1206 వ సంవత్సరం లో 'కురల్‌తాయ్' జరుగుతుంది. టెమూజిన్‌ని మహానేతగా యెన్నుకుని ఛంఘిజ్‌ఖాన్ మహా బిరుదును ( జగజ్జేత) ఆ మహాసభ ప్రసాదిస్తుంది.

నవలలో ఆ చారిత్రక యితివృత్తం యీలా ముగుస్తుంది. మధ్య మధ్యలో బైషీఖాటూన్, అభికులతో టెమూజిన్ గడపడం వంటి సన్నివేశాలు వున్నయి. మత బోధకుల ధార్మిక ప్రవచనాల హోరు వినిపిస్తుంది. నాగరికత పెరిగిందనుకున్న ఆ సమాజంలోని కుళ్ళు బయటపడుతూ వుంటుంది. వీటన్నింటి ద్వారా ఛంఘిజ్‌ఖాన్ వ్యక్తిత్వం, మనస్తత్వం పువ్వు విచ్చుకున్నట్టు విచ్చుకుని అందుతూనే వుంటాయి. కథకు అంతగా దోహదపడని అత్తా కోడళ్ళ తగూలు (యూలన్, బుర్టీ) లాంటివి వున్నయి. కాని టెమూజిన్ వ్యక్తిత్వాన్ని తెలియచెయ్యడానికి ఇవి కొంత ఉపరిస్తాయి.

ఛంఘిజ్‌ఖాన్ వ్యక్తిగా యెలాంటివాడు? పాశ్చాత్య చరిత్రకారులు చిత్రించినట్టు రాక్షసుడా? పశువా? మనిషా? మానవత్వం ఉందా? లేదా?

ఛంఘిజ్‌ఖాన్ చారిత్రక వ్యక్తి. ఒక చారిత్రక యుగంలో, ఓ ఫలానా ప్రాంతంలో, ఓ ఫలానా సమయంలో జీవించిన మనిషి. తన శౌర్య ప్రతాపాల ద్వారా చరిత్ర సృష్టించిన వ్యక్తి, ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించి తనదైన ముద్ర వేసిన మహత్తర శక్తి, అలాంటి వాడు కేవలం కత్తి తోనే తన ప్రాభవాన్ని మెరిసేటట్టు చాట గలిగేడా?లేక మనసున్న మనిషిగా ప్రజల ఆదరాభిమానాలు అందుకుని వాళ్ళ హృదయాల్లో స్థానం సంపాదించుకున్నాడా? చరిత్రకారులు తమ వక్ర దృష్టితో చేసిన అంచనాలు సహేతుకమైనవేనా? లభ్యమవుతున్న ఆధారాలు, పత్రాలు అందించే సమాచారం బట్టి నిష్పక్షపాతంగా మూల్యాంకనం చెయ్యడం సహేతుకమా?

" ఆ మానవుని హృదయాన్ని వ్యక్తం చేయటానికే నేను ఇన్ని వందల పేజీలుగా యీ ప్రయత్నం చేశాను" అని తెన్నేటి సూరి "పరిచయం" లో అంటారు. "దాన్ని విస్పష్టంగా వ్యక్తం చేయగలిగానని పాఠకులంటే నేను కృతకృత్యుడైనట్లే" అని చెప్పుకున్నారు. రచయిత తన ప్రయత్నంలో విజయం సాధించేడని నీళ్ళు నమలకుండా చెప్పవచ్చు.

ఛంఘిజ్‌ఖాన్ గురించి మొదటగా లిఖితరూపంలో పత్రం " సీక్రెట్ హిస్టరీ ఆఫ్ ద మంగోల్స్", దాన్ని మొదట క్రీ.శ.1241లో రాశేరు. అప్పటికి ఛంఘిజ్‌ఖాన్ యింకా సజీవుడుగానే వున్నాడని చాలామంది అభిప్రాయం.

ఛంఘిజ్‌ఖాన్ సంచార జీవిత ఆధిక్యాన్ని చూపించాలని తాపత్రయపడ్డాడు. నగరాలన్నా, స్థిర వ్యవసాయక జీవిత విధానమన్నా సదభిప్రాయం లేదు. ఆ ప్రజల జీవితాల్లో లోపల్లోపల వున్న కుళ్ళు, కపటత్వం, వంచన, దగా లాంటి యేహ్యమైన లక్షణాలు అతనికి వెలపరం కలిగించాయి. మానవత్వాన్ని హరింపచేసే యీ కుహనా నాగరికత యేం సాధిస్తుంది? అని అతని ఆవేదన. తన జాతిని సమున్నత పథం మీద నడిపించాలని ఆవేదన పడ్డాడు. అతని సైనిక వ్యూహం సర్వవిధాలా సన్నద్ధంగా వుండడం. తుఘ్రుల్‌ఖాన్, మహమ్మద్ షా లాంటి వాళ్ళ కుట్రలు ,దుర్మార్గాలు అతనికి దుర్భరంగా కనిపించాయి. యీ నేపథ్యంలోనే దండయాత్రలు చేసాడు. అతనికి సామ్రాజ్యాలు ఆక్రమించుకోవాలనీ, సరిసంపదలు కొల్లగొట్టుకోవాలనీ కాంక్ష లేదు. తమ జీవిత విధానానికి అనుకూలంగా వుండే తీరులో తాము కోరుకున్నది తమకు దక్కుతే చాలు.

ఆ జీవిత విధానం యేమిటి? అది వాళ్ళ ఉత్పత్తి పద్ధతులకు అనుగుణంగానే వుంది. పశుగణం పెంచడం, పచ్చిక బీళ్ళు వుండడం అందులో భాగం. అందుకోసం నిర్జన మైదానాలు అవసరం, మార్క్స్ చెప్పినట్టు, అవి దక్కేదాకా దాడులు చేశాడు. ఉదాహరణకు చిన్ సామ్రాజ్యం మీద దాడి. దక్షిణ మంచూరియాలో పచ్చికబీళ్ళ పర్వత సానువులు తన అధీనంలోకి వచ్చేదాకా దాడి చేశాడు. ఆపైన ముందకు వెళ్ళలేదు. ( యీ వృత్తాంతం యీ నవలలో లేదు) అలాగే మహమ్మద్ షా మీద దాడి. ఖోరెజ్మ్ రాజ్యం ఛంఘిజ్‌ఖాన్ చేతిలో సర్వనాశనం కావడానికి కారణం ఛంఘిజ్‌ఖాన్ కాదు, ఖోరెజ్మ్ ( యీ నవల్లో క్యారిజం అని వుంది) షా చేసిన దుర్మార్గం. రాయబారుల్ని హతమార్చడం. అలాగే తుఘ్రుల్‌ఖాన్ కపటనాటకం వల్ల వచ్చిన పరిణామాలు. వీటిలో ఛంఘిజ్‌ఖాన్ దురుద్దేశంతో తలపెట్టింది ఆవగింజంత అయినా లేదు. అతనికి యెదురైన పరిస్థితులని బట్టి అతని ప్రవర్తన రూపు తీసుకుంది.

నమ్మినవాళ్ళు తండ్రికి విషప్రయోగం చెయ్యడం, తనని బందీ చెయ్యడం, వివాహానికి మాటయిచ్చి ఒడిదుడుకుల రాగానే వెనక్కి తగ్గడం, ఆప్తులుగా పెదాలపై తేనెలు ఒలికించి చివరకు దుర్మార్గం తలపెట్టడం లాంటివన్నీ తనకి గుణ పాఠాలు నేర్పేయి.

"బిషప్ జీ - నా దగ్గర రెండు చిరతగండ్లున్నయ్ - అవి యెప్పడూ నా వెంటనే తిరుగుతూ వుంటై. అవి చెరో వేపునా నా పక్కన పడుకుని నిద్రపోతై - నేను ఆ చిడత పులులు రెంటికి మధ్యగా పడుకుని గుండెల మీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతూ వుంటాను. మానవజాతిని మాత్రం నేను అలా నమ్మి ఆదమరచి బ్రతక లేను" (ఛంఘిజ్‌ఖాన్, 32, పుట 215). యింత స్పష్టంగా తన మనఃస్థితిని బయటకు చెప్పకున్నాడు.

అలాగే మతబోధకుల కౌటిల్యం అతనికి వెలపరం కలిగిస్తుంది. 'రాజద్రోహాన్ని యే మతమూ అంగీకరించదు. (పేజీ 216) అని బిషప్ అంటారు. " అవును గురూజీ మతాలు అంగీకరించే దల్లా అమాయక ప్రజలను హత్య చేయటాన్ని ఒక్కదాన్నే" అని టెమూజిన్ తిప్పి కొడతాడు. అలాగే మహారాజులమీద మతాధికారుల శాసనాలేమి పనిచేస్తాయ్ " అన్నప్పుడు " మహారాజుల మీద చెలామణి కాకపోతే, ఈ మతాలన్నీఅమాయక ప్రజల్ని గొంతులు నొక్కిరాజులకూ, రాణీలకూ బానిసలుగా తయారుచేసి కూర్చోబెట్టడానికే స్వామీ?" అని నిలదీస్తాడు. (పే 217) యితర మతాల మీదనే కాదు, తమ షామానిజం మీదా టెమూజిన్‌కి సదభిప్రాయం లేదు. షామాన్ కుయుక్తుల్ని కనిపెట్టి వెగ్నీని హతం చేశాడు. షామాన్ తనని జగజ్జేత అని మొదట్లో చెప్పి, తండ్రి పోయాక , తాను లేనప్పుడు ఆడిన నాటకం బట్టబయలు చేస్తాడు. షామాన్ కాళ్ళా వేళ్ళా పడి లబోదిబోమంటాడు. చంపెయ్యమని ఏడుస్తాడు. " ఆ భయం నీకక్కరలేదు. ఈ వేళ నుంచీ దేవతల మంత్రాలూ దెయ్యాల మంత్రాలూ జపించడం మానేసి ' 'సూటాబట్ టెంగ్రీ టెమూజిన్ ఖాఖాన్ భగతూర్ నామాన్ని జపించేస్తూ బ్రతుకు, మంగోలు ప్రాణి యెవ్వడూ నీకు హాని చెయ్యడు "అని విదిలించుకుంటాడు. మనిషి మీద అతనికి వున్న ఆదరణ మతం గీతం లాంటి పనకిమాలిన వాటి మీద లేదు.

ఇది చారిత్రక నవల. అంచేత చారిత్రక పరిజ్ఞానమే సరిపోతుంది అనుకోవడం తప్పిదం. నవల సాహిత్య ప్రక్రియ. అంటే ఆయా సన్నివేశాలలో ఆయా పాత్ర అనుభూతులూ, ఆనాటి సమాజంలో వున్న పరిస్థితులకు వాళ్ళప్రతిస్పందనా, వాళ్ళ హృదయవేదనలూ ప్రతిఫలిస్తూ వుండాలి. ఆ సాధనాల ద్వారా ఆ చారిత్రక పరిస్థితుల్లో ఆ మనుషుల సంఘర్షణ వెల్లడవాలి.

టెమూజిన్, చమూగాల పాత్రల ద్వారా ఈ అంశం వెల్లడవుతుంది. నైమాన్ తండాలకు వ్యవసాయం తెలియదు. పశువుల నౌకరులుగా పాలిగాళ్ళుగా, జాలర్లుగా బతుకుతున్నారు. ఈ జీవిత విధానానికి అవసరం అయింది పచ్చిక బీళ్ళు. అడపాదడపా కొన్ని చోట్ల స్థిరనివాసాలు యేర్పాటు చేసుకున్నా-" గాలి బ్రతుకు బ్రతకటమే తప్ప వ్యవసాయాదికాలకు పూనుకున్నవి లేవు - దేరా బళ్ళ నివాసాలు కూడా మారలేదు" (పే 276) చమూగా "కరకరం పర్వతశ్రేణిలో వున్న నైమాన్ రాజధానికి" సాగనంపడంలో టెమూజిన్ ఉద్దేశ్యం యెవ్వళ్ళకీ అంతుబట్టనిది అందుకే. టెమూజిన్ చమూగా సంస్కరణలు ప్రవేశపెట్టి కొత్తరకం పనులు చేస్తాడని గ్రహించే వుండాలి. తద్వారా తాత్కాలిక లబ్ధి కలిగినా రాజకీయ చదరంగంలో పావు అవుతాడన్న యెరుకా వుండి వుండాలి. అంచేతనే చమూగా మళ్ళీ సాయుధం కావడం, ఆత్మరక్షణ కోసమైనా ఆ అవసరాన్ని గర్తించడం విని టెమూజిన్ " మా వాడి ఆయుధ విసర్జన కార్యక్రమం మళ్ళీ యిలా యెలా మారింది?" అని నవ్వుతూ అడుగుతాడు. ఆ నవ్వులోనే అతని ఊహ వెల్లడవుతుంది.

చముగా కళ్ళు తెరిచేటప్పటికి పెనుతుఫాన్ ముంచుకు వస్తూనే రాజకీయ కుతంత్రానికి తన పథకాలు భగ్నమైపోయేయి. " తాను కలలుగంటున్న మహాయుగ నిర్మాణమంతా ఒక్కసారి పేకమేడలా కూలి పోతుందనుకుని కలవరపడ్డాడు. అతనికి లోపలినుంచి ఎక్కడా లేని యేడుపు పొర్లుకొచ్చింది." (పే 303-304) ఆఖరికి అంతం విషాదంగా ముంచుకొచ్చింది. అతనికి మానసిక క్షోభ ఆత్మహత్యతో తేలింది. కన్నతల్లికి కూడా అది చేతకానితనంగా కనిపించింది. అతను పరికిపందగా తనువు చాలించినందుకు గొల్లున యేడ్చి కుప్పలా కూలిపోయింది."

'క్వారిజం'(ఖోరెజ్మ్) మహమ్మద్ షా చేసిన దురాగతం రాయబారుల హతం కరాచర్ కెరాయిమ్‌కుట్రకు బలైపోతాడు. తోబుట్టువు యూలన్ వెర్రిగా రోదిస్తుంది. తన కొడుకును పిశాచం అని శాపనార్థాలు పెడుతుంది. " నీవు కన్నది రాక్షసుణ్ణి కాదు తల్లీ, రాక్షసుణ్ణి కని వుంటే ఇలాంటి చిక్కులన్నీ నీకు సంప్రాప్తించి వుండేవి కాదు. వట్టి అజ్ఞానపు చచ్చు వెధవను కన్నావు. కనుకనే ఈ బాధలన్నీ అనుభవించుతున్నావు" అని టెమూజిన్ వ్యథ చెందుతాడు. ఈ మాటల్లో టెమూజిన్ వ్యక్తిత్వం యావత్తూ ధగద్ధగాయమానంగా ప్రకాశమానం అవుతుంది. తనే గనక అలాంటి దుష్ట స్వభావం వున్నవాడయితే రాయబారుల్ని హత్య చేయించిన పాలెగాడు ఇనాల్‌చిక్‌ని తనకి అప్పగించమనీ, లేకపోతే పరిణామాలు చవిచూడమనీ మహమ్మద్ షాకి కబురు చేసి వుండేవాడే కాదు. కెరాయిట్ పంచమాంగ దళాలకు కరాచర్‌ను బలి పెట్టీ వుండేవాడే కాదు. (వి.యాన్ నవలలో మహమ్మద్ షాకి రాసిన వుత్తరం వగైరాల వృత్తాంతమంతా వుంది) మరి చరిత్రకారులు ఛంఘిజ్‌ఖాన్‌ని రాక్షసుడన్నారు!

చారిత్రక నవల చారిత్రక యితివృత్తాన్ని ప్రతిఫలిస్తూ వుంటుంది. అయితే సన్నివేశాలు, పాత్రల సంభాషణలు ఆ యితివృత్తాన్ని అందిస్తూ వుంటాయి. దీన్నే చరిత్ర నాటకీకృతం కావడం అంటారు. " శుష్క శాస్త్ర చర్చకు దిగకుండా ఆ ఘటనలు వ్యక్తుల జీవితాలను ఏ విధంగా మార్చివేసిందీ వ్యక్తుల హృదయాలను యే విధంగా కలచివేసిందీ కళాత్మకంగా ప్రదర్శిస్తుంది" ఘటనల చిత్రీకరణ రా.రా. చెప్పినట్టు.

తెన్నేటి సూరి ఛంఘిజ్‌ఖాన్ నవల సాహిత్య లక్షణాలని యే ఒక్కపిసరూ జారవిడుచుకోలేదు. ఛంఘిజ్‌ఖాన్ వ్యక్తిత్వాన్ని ఆనాటి చారిత్రక దశ నేపథ్యంలో ఆవిష్కరించడం ఆయన లక్ష్యం. రచయిత సన్నివేశ కల్పనలో సంభాషణల్ని నడిపించడంలో కథను ముందకు తీసుకుపోవడం యెక్కడా కుంటలేదు. వర్ణనలు అని విధాలా అతికినట్టు వున్నాయి.

అయితే సంభాషణలు సన్నివేశాలు పాఠకునికి ఆ నేపథ్యాన్ని రూపు కట్టించకుండా రచయిత జోక్యం చేసుకోవడం వల్ల కథా గమనంలో నాటకీయత కి " స్పీడ్‌బ్రేకర్" పడుతుంది. సూరి నవలలో ఒకటి రెండు సందర్భాలలో అలాంటి జోక్యం లేకపోలేదు.

టర్గుటాయ్ టెమూజిన్‌ని బంధించినపుడు "మానవజాతి టెమూజిన్‌కు యిలాంటి సౌజన్యాన్ని చూపించింది. చివరికి అతనికి కనికరం లేదనీ, రాక్షసుడనీ ఏడ్చింది" (పే. 102) అని రచయిత చాటడం ఛంఘిజ్ పట్ల ఆయనకున్న అభిమానాన్ని అద్దంలో చూపిస్తుందే గాని, నాటకీయతకు అద్దం పట్టదు.

అలాగే " నాటు రకం చరిత్రకారుడి" అవలక్షణం గురించిన వ్యాఖ్యలు (పే.258) సందర్భానికి, ముఖ్యంగా నవలా సన్నివేశానికి అవసరం లేదు. టెమూజిన్ సైనిక వ్యూహం యెలాంటిదో పాఠకుడే గ్రహించాలి తప్ప రచయిత కోర్టులో లాయరు జడ్జీతో 'నోట్ దిస్ పాయింట్ యువరానర్" అన్నట్టు ( కనీసం సినిమాలో చూపించినట్టు) వుండకూడదు. (పే.258). యిలాంటిదే మరో సందర్భం తుఘ్రుల్‌ఖాన్‌కు టెమూజిన్ లేఖ రాయడం. రచయిత ఆ ఉత్తరం గురించి, చరిత్రకారులు టెమూజిన్‌ని "నరహంతకుల" జాబితాలో చేర్చడం గురించీ వ్యాఖ్యానించడం. (పే.321). యీ వ్యాఖ్యలు యీ సందర్భంలో అనవసరం.

(యాన్ నవలలో మహమ్మద్ షాకి రాయబారుల హననం విషయంలో ఉత్తరం రాయిస్తాడు. షా యుద్ధం కోరుకున్నందుకు యుద్ధం యిదిగో అని రాయిస్తాడు. ఆ సన్నివేశంలో షా చేసిన దుర్మార్గం, జెంఘిజ్ అనుసరించిన పద్ధతి జెంఘిజ్‌ఖాన్ వ్యక్తిత్వాన్ని తెలియచేస్తాయి.) ఇలాంటి ఒకటి రెండు చంద్రునిలో మచ్చలు తప్పిస్తే సూరి "ఛంఘిజ్‌ఖాన్" అన్ని విధాలా ఉత్తమ చారిత్రక నవల.

జోర్గెన్ బిష్క్ "మంగోలియా, అన్‌నోన్‌లాండ్" లో ఛంఘిజ్‌ఖాన్ వ్యక్తిత్వం గురించి అతనొక అద్భుతమైన వ్యక్తి అని రాస్తాడు. 'నియంతే కాని ప్రజలు యెంతగానో అభిమానించి తమకు తాము అర్పించుకునే ఆదరణ అతనుపొందేడు, భయభక్తుల వల్లా కొందరి ఆదరణ పొందేడు' అని రాశేడు.

ఏ మహానాయకుడైనా కేవలం కత్తి ఝుళిపించి తన ఆధిక్యం నిలబెట్టుకుంటాడనటం తప్పు. ప్రేమాభిమానాలు పొందనివాడు చరిత్రలో నిలవడు - హిట్లర్ లాగా. కానైతే ఒక విషయం వుంది. ఛంఘిజ్‌ఖాన్ యుగానికి చరిత్ర చాలా ముందుకు సాగింది. సహజ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఆటంకం కలిగింది. స్థిర నివాసాలు, వ్యవసాయ నాగరికత - అది యెంత దుర్గంధపూరితం అయిందైనా, కృత్రిమం అయిందైనా - సంచార జీవితం, ఆ ఉత్పత్తి విధానం కంటే ముందు అడుగే. ఆ నేపథ్యంలో ఛంఘిజ్ మంగోలు ప్రజల అభ్యున్నతికి చేసిన లాంటి ప్రయత్నాలు ఫలించవు. కాని తన పరిధిలో తన భావాల మేరకు ఛంఘిజ్‌ఖాన్ విజయ కేతనం యెగరేశాడు. సాటిలేని యోధుడనిపించుకున్నాడు. అలాంటి యోధుని వ్యక్తిత్వం యెలాంటిదో రూపు కట్టించడమే తెన్నేటి సూరి "ఛంఘిజ్‌ఖాన్" నవలలో చేసిన ప్రయత్నం. సూరి తన కృషిలో విజయం సాధించారని ఘంటాపథంగా చెప్పవచ్చు.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం తెలుగు లిటరరి అండ్ కల్చరల్ అసోసియేషన్ (న్యూయార్క్) వదాన్య సౌజన్యంతో అందించబడింది.